

## డీజేఎఫ్ రాష్ట్ర 11వ మహాసభలపై సమీక్ష సమావేశం

- దళిత జర్నలిస్టులకు సలహాలు ఇచ్చిన
- వ్యవస్థాపకుడు కాశపోగు జాన్‌లి

2




# సంగారెడ్డి మెదక్

ఆదివారం 27 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:11


# జర్నలిస్టుల హక్కుల కోసం సమరశంఖం

- సమస్యలపై టీడబ్ల్యుజేఎఫ్ పోరుబాట
- అక్రిడిటేషన్ నుంచి రైల్వే పాస్‌ల వరకు
- జర్నలిస్టుల హక్కుల కోసం ఉద్యమం
- హక్కుల సాధనకు

మరో అడుగు - టీడబ్ల్యుజేఎఫ్ 3వ మహాసభకు సర్వం సిద్ధం.







**కల్హేర్ /నారాయణఖేడ్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):**
జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్) నిరంతరం పోరాడుతోందని నాయకులు తెలిపారు. సెప్టెంబర్ నెల 27న ఉదయం 11 గంటలకు నారాయణఖేడ్ పట్టణంలోని విశ్వకర్మ భవన్‌లో డివిజన్ 3వ మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2 లో

# ఇంట్రలైజేషన్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం

- హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా






**నర్సాపూర్ 26 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి)**
జిల్లా మార్కెట్ యార్డులో శనివారం నాడు ఇంట్రలిజేషన్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం. 40,000 భోజనాల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించిన అత్యాధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి,మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ప్రారం భించారు. ఈ కిచెన్ ద్వారా మెదక్ మరియు నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లోని 395 ప్రభుత్వ పాఠశాలలు,10 జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజు వేడివేడి, పరిశుభ్రమైన, పౌష్టికాహారంతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందనుంది.

మిగతా 2 లో

# జర్నలిస్టుల హక్కుల కోసం సమరశంఖం

మొదటిపేజీ తరువాయి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఉచిత ఆర్టీసీ బస్ పాస్‌లు, రైల్వే పాస్‌ల పునరుద్ధరణ కోసం సంఘం పలు ఉద్యమాలు చేపట్టిందన్నారు. కరోనా సమయంలో జర్నలిస్టులకు అండగా










నిలిచామని తెలిపారు. అక్రిడిటేషన్ల సమస్యపై జిల్లా కలెక్టరేట్లు, హైదరాబాద్ ఐ అండ్ పీఆర్ కార్యాలయం ఎదుట నిరసనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.రైల్వే పాస్‌ల పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రులు, రైల్వే బోర్డు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. జర్నలిస్టుల రక్షణ, సంక్షేమంపై కూడా ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తున్నామని చెప్పారు.మూడో మహాసభలో ఇప్పటివరకు చేపట్టిన ఉద్యమాలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు టీడబ్ల్యుజేఎఫ్ నాయకులు తెలిపారు.

# డీజేఎఫ్ రాష్ట్ర 11వ మహాసభలపై సమీక్ష సమావేశం

మొదటిపేజీ తరువాయి

**హత్నూర సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ దళిత జర్నలిస్టుల ఫోరం డీజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర 11వ మహాసభల నిర్వహణకు సంబంధించి శనివారం నాడు సంగారెడ్డిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు రామని అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డీజేఎఫ్ వ్యవస్థాపకుడు కాశపోగు జాన్ ముఖ్య అతిథిగా హాజరై మహాసభల ఏర్పాట్లపై సమీక్షించారు.మహాసభల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై కాశపోగు జాన్ సంతృప్తి వ్యక్తం చేశారు.రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో దళిత జర్నలిస్టులు ప్రతినిధులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు,ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.మహాసభలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి,ఉపాధ్యక్షుడు ప్రకాష్, జిల్లా సలహాదారు మీనంపల్లి కిషన్ రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న, కార్యనిర్వాహక కార్యదర్శి వరిగుంతం శంకర్,ఉపాధ్యక్షుడు దశరత్,మోహన్, బుచ్చయ్య, మద్దెల పోచన్న ,ఆవుల మల్లేశం,దాసు,రాజు,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# ఇంట్రలైజేషన్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం

మొదటిపేజీ తరువాయి






అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించినారు.గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క విద్యార్థి ఖాళీ కడుపుతో బడికి రాకూడదనే గొప్ప లక్ష్యంతో ఈ 'సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని' అమలు చేస్తోంది.ఈ పథకం వల్ల విద్యార్థుల్లో హాజరు శాతం పెరుగుతుంది,ఆరోగ్యం మెరుగుపడుతుంది,చదువుపై శ్రద్ధ పెరుగుతుంది.పేద తల్లిదండ్రులకు ఇది ఎంతో భరోసా అని అన్నారు.నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్ తో పాటు వారంలో 3 రోజులు పాలు,3 రోజులు రాగి జావ అందించడం ద్వారా పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గారు, హ్యాసైఫ్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీమాన్ సత్య గౌర చంద్ర దాస స్వామీజీ, మెదక్ మున్సిపాల్ చైర్మెన్ రాధిక, కౌన్సిలర్స్,సర్పంచులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చాకరిమెట్ల ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం

## - రూ.1,16,116లకు లడ్డూ వేలం..

## అన్నదానానికి బియ్యం అందించనున్న దాతలు

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 26:**



శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల స్వయంభూ శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానంలో గణపతి



నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించగా నర్సాపూర్‌కు చెందిన అభిరామ్ బిన్ని రైస్ మిల్ నిర్వాహకులు చెర్విరాల శ్రీనివాస్ గుప్తా,మహేశ్వరి దంపతులు రూ. 1,16,116లకు లడ్డూను దక్కించుకున్నారు. వేలంపాట ద్వారా వచ్చిన మొత్తంతో దేవస్థానంలోని అన్నప్రసాద కార్యక్రమానికి అవసరమైన బియ్యాన్ని కొనుగోలు చేసి అందించాలని ఆలయ ఫౌండర్,చైర్మన్ ఆంజనేయ శర్మ దాతలకు సూచించారు. భక్తుల సేవలో భాగంగా దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం గణపతి విగ్రహాన్ని ఎడ్లబండిపై అలంకరించి భక్తుల భజనలు,జై గణేశ్ నినాదాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,దేవస్థాన సిబ్బంది, నర్సాపూర్‌కు చెందిన అయ్యప్ప మారుతి క్లాత్ స్టోర్ నిర్వాహకులు, గణపతి విగ్రహ దాతలు,పాత్లోత్ హార్సింగ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ ఫౌండర్,చైర్మన్ ఆంజనేయ శర్మ పర్యవేక్షించారు.

# అణచివేతపై అలుపెరగని పోరాటం.. వీరనారి చాకలి ఐలమ్మ

## - చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

## మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని రవీందర్ గౌడ్

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 26:**



తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను తూప్రాన్ పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని రవీందర్ గౌడ్ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. నిరంకుశ పాలన, దొరల అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన ఉద్యమం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను నేటి సమాజం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్ రాథోడ్, చెలిమల రాములు, ఐలేష్ యాదవ్, నారాయణ గుప్త, లయన్ జానకిరామ్ గౌడ్, కొట్టాంల ఉపేందర్, బయికాడి నర్సింలు, ఆంజనేయులు, యాదిగిరి, ముత్యాలు, ఎల్లం తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

# గిర్మాపూర్ గురుకుల పాఠశాల,కళాశాలలో అధికారుల తనిఖీ.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



మండల పరిధిలోని గిర్మాపూర్ తెలంగాణ రెసిడెన్షియల్ (గురుకుల) పాఠశాల/కళాశాలను కొండాపూర్ తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో సౌమ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల/కళాశాల పరిసరాలు, విద్యార్థుల వసతి, భోజన సదుపాయాలు, తరగతి గదులు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మాజీ సర్పంచ్ పబ్బ రమేష్ గుప్తాను పరామర్శించిన - ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 26:**

శివ్వంపేట మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ రమేష్ గుప్తా అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శనివారం శివ్వంపేటలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ గుప్తా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే రమేష్ గుప్తా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా రమేష్ గుప్తాను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట గ్రామ సర్పంచ్ రాజీపేట్ వెంకటేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్,మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్,గొర్రె వెంకట్ రెడ్డి,లక్ష్మీనర్సయ్య,పోచయ్య, వంజరి కొండల్ తదితరులు ఉన్నారు,



# దంతాన్‌పల్లిలో ఘనంగా హనుమాన్ వినాయకుడి నిమజ్జనం

**శివ్వంపేట ప్రజాజ్యోతి,సెప్టెంబర్ 26:**

శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామంలో హనుమాన్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శివ్వంపేట మండల తహసీల్దార్ కమలాద్రి చారి,ఆర్ఐ నిరంజన్,జీపీఓ నరేష్ హాజరై ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గజేంద్రుల మమత నర్సింలు,రేషన్ డీలర్ గొల్ల గోపాల్,వార్డు సభ్యుడు నిమ్మల సంపత్, వినాయక కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు గొల్ల శేకులు,దుర్గం ప్రశాంత్,గొల్ల నర్సింలు,నాంచారి ప్రకాష్‌తో పాటు పలువురు భక్తులు నిమజ్జన వేడుకలో పాల్గొన్నారు. గణనాథుడికి భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికిన భక్తులు గ్రామంలో సుఖశాంతులు, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు.





# మహిళా సంక్షేమానికి పెద్దపీట.. శెట్ట్‌పల్లిలో రూ.10 లక్షల భవనానికి భూమిపూజ

## - నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి



**వెల్దుర్తి (ప్రజాజ్యోతి), సెప్టెంబర్ 26:**

వెల్దుర్తి మండలం శెట్ట్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి భూమిపూజ





చేశారు. అనంతరం రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని మహిళల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఇంకా ఏవైనా సమస్యలు లేదా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ పడిగే శేఖర్‌కు సూచించారు. గ్రామంలో మహిళా సమైక్య భవనం నిర్మాణంతో మహిళలకు మరింత ఉపయోగకరమైన వేదిక అందుబాటులోకి రానుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డుతో గ్రామ ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడిగే శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్, నాయకులు కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ, పడిగే నరసింహులు, శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, మహేందర్, రమేష్ చందర్ గుప్తా, అశోక్ గౌడ్, శాఖరం శ్రీనివాస్ గౌడ్, వెల్దుర్తి ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, ఏపీఎం సుభాష్‌తో పాటు మండల సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దత్తగిరి బాటలో నడుస్తాం..!

## - డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

## - ఘనంగా దత్తగిరి మహారాజ్ 104వ జయంతి వేడుకలు

**జహీరాబాద్, సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి న్యూస్)**

సత్పురుషుడు, మహాయోగి, ధర్మ స్థాపన కోసం కృషి చేసిన శ్రీపాద వల్లభులు, దిగంబరయోగి దత్తగిరి మహారాజ్ చూపిన ధర్మబాటలో నడుస్తామని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు, మహా మండలేశ్వరులు అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. ఆయన ఆశయాల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతా మని తెలిపారు. శనివారం దత్తగిరి మహారాజ్ 104 వ జయంతి సందర్భంగా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో గోపూజ, గురుపాద పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, రుద్ర సహిత దత్త యజ్ఞం, పూర్ణాహుతి, ప్రవచనామృతం, భజన, వస్త్ర, పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ, నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తగిరి మహారాజ్ ప్రారంభించి వేద పాఠశాల, బసవ పురాణం, గోసంరక్షణ, నిత్య అన్నదానం, విశ్వమానవ ధర్మ ప్రచారం, వృద్ధాశ్రమం, అనాథ ఆశ్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందినిగిరి మాత, శ్రీపాద స్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, బోయిని ఎల్లన్న, నాగన్న పాటిల్, బసవరాజ్ పాటిల్, కోట శ్రీనివాస్, సంగయ్య స్వామితో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.





# మట్టి వినాయకుడికి ఘనంగా వీడ్కోలు

**రాయికోడ్ సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడి నిమజ్జన మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పన్నెండు రోజులుగా స్వామివారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వ హించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా పిల్లలు, పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. చిరుతల రామా యణం, భక్తి గీతాలకు నృత్యాలు చేస్తూ, భజనలు చేస్తూ పురవీధుల గుండా గణనాథుడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరుడిని గంగమ్మ ఒడికి చేర్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



### వేలంలో లడ్డూలకు భారీ ధర

నిమజ్జనానికి ముందు నిర్వహించిన ప్రసాదాల వేలం పాటలో పెద్ద లడ్డుకు భారీ ధర పలికింది. గ్రామానికి చెందిన ఇందూరి ప్రభాకర్ పెద్ద లడ్డును రూ.75,500 లకు దక్కించుకున్నారు. అలాగే చిన్న లడ్డును అంజలి మోటార్స్ యజమాని, బాదర్‌గామకు చెందిన మెకానిక్ నర్సిములు రూ.50,500 లకు వేలంలో దక్కించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తి సందడి నెలకొంది.





# నిరక్షరాస్యతకు చెక్.. 'ఉల్లాస్'తో అక్షరాస్యత, డ్రైవింగ్ లైసెన్స్‌కు అవకాశం

## 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలి: ఏపీఎం దేవేందర్

**అందోల్, సెప్టెంబర్ 26, (ప్రజా జ్యోతి):**



నిరక్షరాస్యత నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులకు అక్షరాస్యులుగా గుర్తింపు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు అందోల్ ఏపీఎం దేవేందర్ తెలిపారు. నవభారత సాక్షరత మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారం మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక విషయాలపై అవగాహన కల్పించి అక్షరాస్యత సాధించేలా ప్రోత్సహిస్తారని తెలిపారు. కార్యక్రమం ద్వారా అక్షరాస్యత సాధించిన వారికి సర్టిఫికెట్ అందజేసి అధికారికంగా అక్షరాస్యులుగా గుర్తింపు కల్పిస్తారని చెప్పారు. ముఖ్యంగా ఈ సర్టిఫికెట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు కూడా అర్హత సాధించే అవకాశం ఉందని దేవేందర్ తెలిపారు. అక్షరాస్యతతో వ్యక్తిగత జీవితంలోనూ, సామాజికంగా కూడా అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్, ఇతర సేవలను స్వయంగా వినియోగించుకోవడానికి అక్షరాస్యత ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులు, ముఖ్యంగా అక్షరాస్యత సాధించాలనే ఆసక్తి ఉన్న మహిళలు ఉల్లాస్ కార్యక్రమంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం దేవేందర్ పిలుపునిచ్చారు.

# ఏడీఏగా ప్రవీణ్‌చారి బాధ్యతల స్వీకరణ

**కల్హేర్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి ):**

నారాయణఖేడ్ వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏగా నాగలిగిద్ద ఏవో ప్రవీణ్‌చారి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు నారాయణఖేడ్ డివిజన్‌లో ఏడీఏగా విధులు నిర్వహించిన నూతన్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ప్రవీణ్‌చారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ప్రవీణ్‌చారి తెలిపారు. రైతులకు వ్యవసాయశాఖ అందిస్తున్న పథకాలు, సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.




# బిజిలిపురంగ్రామంలో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణి

**వట్పల్లి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 26**

వట్పల్లి మండలం బిజిలిపురంగ్రామంలో శనివారంరోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త డిజిటల్ రేషన్ కార్డ్స్ లబ్ధిదారులకు సర్పంచ్ నాగమణి నర్సింలు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివశంకర్ అరవింద్ చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవనీయులైన మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశానుసారం అర్హులైన ప్రతిఒక్క పేదలకు ఆకలితో అలమటించకూడదని, సన్న బియ్యం తో పిల్లలు, పెద్దలు కడుపునిండా తినాలని ఉద్దేశంతో పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఆహార భద్రత కార్డ్ పైననే ప్రతీ సంక్షేమ పథకం ఆధార పడునని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మరియు బి పి పాండు వాడు నెంబర్లు మల్లేశం భాగేశం లింగం రజిని కాంత్ గ్రామ పెద్దలు వీరేశం శంకర్ మల్లేశం కుమార్ రాజు గ్రామ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

- టి యు డబ్ల్యూ జే-హెచ్

143 పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

-అధ్యక్షుడిగా రాఘవరెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా అంతారం మహేష్‌గౌడ్

-ఐదు మండలాల జర్నలిస్టుల ఏకగ్రీవ నిర్ణయం

**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 26:**



జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తామని టి యు డబ్ల్యూ జె-హెచ్ 143 పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన జర్నలిస్టులు



ఏకతాటిపైకి వచ్చి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధూళిపాళ్ల రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంతారం మహేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన జర్నలిస్టులందరికీ రాఘవరెడ్డి, మహేష్‌గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీకి తీసుకెళ్లడంతోపాటు, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కులు, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల విషయంలో



ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ నాయకులకు, జిల్లా కమిటీ నాయకులకు నూతన కార్యవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. యూనియన్ బలోపేతానికి ప్రతి జర్నలిస్టు భాగస్వామ్యం అవసరమని, అందరి సహకారంతో సంఘాన్ని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంతారం మహేష్‌గౌడ్‌లకు అభినందనలు తెలిపారు. యూనియన్ ద్వారా జర్నలిస్టుల సమస్యలను సమష్టిగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిన్నారం, గుమ్మడిదల, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనగారిన వర్గాలకు చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**అందోల్, సెప్టెంబర్ 26, (ప్రజా జ్యోతి):**



అన్యాయాన్ని ఎదిరించి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రజక సంఘం నాయకులు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆందోల్ మండలం కంసానిపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె చేసిన పోరాటాన్ని, చూపిన తెగువను స్మరించుకున్నారు. సామాజిక అసమానతలు, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఆమెను స్ఫూర్తిగా తీసుకుని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనతో పాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు.కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు భూమయ్య, ప్రభు, సంగయ్య, రవి, మల్లేశం, దుర్గాప్రసాద్, జగన్, ఈశ్వర్, ఉదయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- ఘనంగా 131వ జయంతి వేడుకలు
- భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి ఎదురు నిలిచిన ధీరవనిత
- అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ పోరాటం
- సమానత్వం, న్యాయం కోసం ఆమె ఆశయాలను కొనసాగించాలి

**జహీరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి న్యూస్)**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం రంజోల్ లో రజక సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అధ్యక్షులు, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్దు రావణ్ ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.

### తెలంగాణ పోరాట చరిత్రలో చెరగనిముద్ర

ఈ సందర్భంగా సిద్దు రావణ్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ధైర్యసాహ సాలకు ప్రతీకగా నిలిచిన వీరనారి అని కొనియాడారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి ఆమె ధైర్యంగా ఎదురు నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.



### ఆత్మగౌరవ పోరాటానికి ఐలమ్మ ఆదర్శం

చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకమని సిద్దు రావణ్ అన్నారు. అన్యాయం ఎదురైనప్పుడు వెనుకడుగు వేయకుండా హక్కుల కోసంపోరాడిన ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకో వాలని సూచించారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

### నేటి తరానికి ధైర్యం, న్యాయం, సమానత్వం సందేశం

ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి ధైర్యంగా నిలబడే స్ఫూర్తిని అందిస్తాయని సిద్దు రావణ్ తెలిపారు.అణగారిన వర్గాల హక్కులు, ఆత్మ గౌరవం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె త్యాగా లను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి లి నేటి సమాజంలో కూడా సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మ గౌరవం కోసం ప్రజలు ఐక్యంగా పనిచేయాల్సి న అవసరం ఉందని సిద్దు రావణ్ అన్నారు. యువత చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను తెలుసు కొని ఆమె పోరాట స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు.మహిళల హక్కులు, గౌరవం కోసం ఐలమ్మ చూపిన ధైర్యం ప్రతిఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. లి ఘనంగా నివాళులర్పించిన నాయకులు లి ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షులు అలీమ్ హుస్సేన్, నాయకులు రాములు, విజయ్ కుమార్, ఆగమయ్య, బలరాం, బాల్రాజ్, రజక సంఘం నియోజక వర్గ నాయకులు వెంకటేశం, పెంటన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. అనంతరం ఆమె సేవలు, పోరాటా లను స్మరించుకున్నారు. ఐలమ్మ ఆశయాలను ప్రతి గ్రామానికి, ప్రతి తరానికి చేరేలా కార్యక్రమాలు నిర్వ హించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పంపిణీ. ముఖ్య అతిథిగా డాక్టర్ పి సంజీవరెడ్డి లబ్ధిదారులకు చెక్కుల అందించారు

**కల్హేర్, సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి:**

నారాయణఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కల్హేర్ మండలానికి చెందిన ఫాతేపూర్, మార్డి, ఇంద్రనగర్, కల్హేర్ తదితర గ్రామాల లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు మల్డొడ్డి తుకారాం, మచ్చేందర్, ఎర్ర రవి. వై. నర్సింహారెడ్డి. ఎన్నం రవీందర్ రెడ్డి.తదితరులు పాల్గొన్నారు.





# ఖాజీపల్లి జీఎంఆర్ కాలనీలో గణేశ్ లడ్డూ వేలం

-రూ.2,21,116కు దక్కించుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ గండి స్వప్న కుమార్‌యాదవ్

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీపల్లి జీఎంఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. లడ్డూను రూ.2,21,116లకు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ గండి స్వప్న కుమార్‌యాదవ్ దక్కించుకున్నారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉత్సవాల్లో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లడ్డూ వేలం సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. చివరకు రూ.2.21 లక్షలకు లడ్డూను కౌన్సిలర్ గండి స్వప్న కుమార్‌యాదవ్ కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. లడ్డూ వేలానికి భక్తులు, కాలనీ వాసులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేశారని పేర్కొన్నారు. గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.లడ్డూను కైవసం చేసుకున్న గండి స్వప్న కుమార్‌యాదవ్‌ను నిర్వాహకులు, కాలనీ వాసులు అభినందించారు.



# తెలంగాణ తెగువకు ప్రతీక చాకలి ఐలమ్మ: కల్హే ర్ మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి.

## - చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం



**కల్హేర్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్హేర్ మండలం మాజీ జెడ్పీటీసీ జి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.నాటి నిరంకుశ పాలనకు, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని అన్నారు. హక్కుల కోసం వెనుకడుగు వేయకుండా పోరాడిన ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మహిళలు సైతం సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ తమ హక్కుల కోసం పోరాడగలరని తన కార్యాచరణ ద్వారా ఐలమ్మ నిరూపించారని తెలిపారు.తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర శిరస్మరణీయమని, ఆమె ఎప్పటికీ మహిళాలోకానికి స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ డైరెక్టర్ చంద్రప్ప స్వామి, మల్లొడ్డి పందరి, చాకలి భూపతి, చాకలి సాయిలు, సాలె కిష్టయ్య, జన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు..

---

# బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి

## - బాల్య వివాహాలు నిర్వహించే మత పెద్దలపై చట్టపరమైన చర్యలు .

## - బాల్య వివాహ రహిత జిల్లాగా సంగారెడ్డి .. జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి .

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**





బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు తమవంతు సహకారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, స్కోప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో బాల్య వివాహంతో బతుకు ఆగంబాల్య వివాహ నిషేధ చట్టం-2006 అంశంపై శనివారం జిల్లాలోని పూజారులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు నిర్వహిస్తే సంబంధిత మత పెద్దలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాహాలు నిర్వహించే సమయంలో వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలని మత పెద్దలకు సూచించారు.అన్ని మతాల మత పెద్దల సహకారంతో సంగారెడ్డి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రాజా రెడ్డి మాట్లాడుతూ .. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, మత పెద్దలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.డీసీఆర్‌బీ సీఐ రమేష్ మాట్లాడుతూ .. బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరంగా శిక్షలు ఉంటాయని, రూ.1 లక్ష వరకు జరిమానా, రెండేళ్ల వరకు కారాగార శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీవో) రత్నం మాట్లాడుతూ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాల్య వివాహాల నివారణలో మత పెద్దల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీ ఉప్పలయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు వెంకటేశం, విష్ణుమూర్తి, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, డీసీపీయూ సిబ్బంది లింగం, జిల్లాలోని సుమారు 100 మంది మత పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

---

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి

## సీఐటీయూ వట్టిపల్లి మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్




**వట్టిపల్లి, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం, భూమి హక్కుల కోసం వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో నేటి సమాజంలో పేదలు, కార్మికులు, రైతుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ వట్టిపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ ఎర్రోళ్ల మహేష్ పిలుపునిచ్చారు.వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సీఐటీయూ వట్టిపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన ధైర్యం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.తన భూమి, తన హక్కుల కోసం ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఆమె సాగించిన పోరాటం పేదలు, రైతులు, మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరిగే దోపిడీ, వివక్ష, అన్యాయాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడటమే ఐలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.చాకలి ఐలమ్మ ఒక వ్యక్తి మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవానికి, మహిళా ధైర్యానికి, రైతాంగ హక్కుల పోరాటానికి ప్రతీకగా నిలిచారని మహేష్ పేర్కొన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి అందిస్తూ, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరేందర్ గౌడ్, వెంకటేష్, లక్ష్మణ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



# భక్తికి మతం అడ్డు కాదు.. గణేష్ లడ్డూ వేలంలో ముస్లిం యువకుల ఘనత

- కులమతాలకు అతీతంగా వినాయక భక్తి..

రూ.4.45 లక్షలు, రూ.45,100కు లడ్డూలు దక్కించుకున్న ముస్లిం యువకులు.

**కల్హేర్. 26.సెప్టెంబర్. ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం లోని కంగ్టిలో లడ్డూ వేలంపాట చరిత్ర తిరగరాసింది. సిద్ధి వినాయక గణేశ్ యూత్ ఆధ్వర్యంలో నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. నేతాజీ కూడలిలో నిర్వహించిన లడ్డూ వేలంలో భీమ్రకు చెందిన షేక్ మోహిన్ వేలం పాట పాడి రూ.4,45,000కు లడ్డూ కైవసం చేసుకున్నారు. ముస్లిం వ్యక్తి ఇంత పెద్ద మొత్తంలో వేలం పాడి లడ్డూ దక్కించుకోని అందరిని ఆశ్చర్యపరిచాడు. రూ.45,100కు లడ్డూ దక్కించుకున్న రహీంఅబ్బెందలోని హనుమాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో వార్కరి సంప్రదాయ భజనలు, కోలాటాలతో శోభాయాత్ర సాగింది. లడ్డూ వేలంలో ముస్లిం యువకుడు ఎండీ రహీం (ముస్తఫా) రూ.45,100కు దక్కించుకున్నారు. గ్రామస్థులు ఆయనను అభినందించారు. కులమతాలకు అతీతంగా పండుగలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.





# వినాయకునికి 25 కేజీల భారీ లడ్డూ సమర్పించిన పులిమామిడి రాజు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సదాశివపేట పట్టణంలోని పాతకేరి ప్రాంతంలో ఉషాకిరణ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి పులిమామిడి రాజు పాల్గొని ప్రత్యేక కలశ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయకునికి ఇష్టమైన లడ్డూను ప్రత్యేకంగా శివలింగం ఆకారంలో 25 కేజీల భారీ లడ్డూగా తయారు చేయించి స్వామివారికి సమర్పించారు. అనంతరం బామిని అరుణరవికుమార్ దంపతులు, చీలం మాధవిసురేష్ దంపతులు వినాయకునికి చివరి కలశ పూజ నిర్వహించి కలశాన్ని కదిలించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.తదుపరి పులిమామిడి రాజు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన మహిళా కళాకారుల కోలాటం, చిటికెలు, అఘోర కళాకారుల ప్రదర్శనలు, డప్పు చప్పుళ్ల నడుమ వినాయకుడిని పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఇట్టి కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమతతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి



సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని వారు కూడా సంతోషంగా కళాకారులతో కలిసి స్టెప్పులు వేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.అధిక సంఖ్యలో వార్డు ప్రజలు, మహిళలు, పురుషులు, ఉషాకిరణ్ యూత్ సభ్యులు పాల్గొని వివిధ రకాల నృత్యాలతో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఊబ చెరువులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

# వట్పల్లి పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తాం





**అందోల్, సెప్టెంబర్ 25, (ప్రజాజ్యోతి):**

వట్పల్లి మండల పీఆర్టీయూటీఎస్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడు పి. దిగంబర్ రావు అధ్యక్షతన, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఏ. మానయ్య ఆధ్వ ర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.మండల శాఖ అధ్యక్షుడిగా కె. సిద్ధేశ్వర్ (ఎంపీయూపీఎస్ నాగులపల్లి), ప్రధాన కార్యదర్శిగా పి. శ్రీశైలం (ఎంపీపీఎస్ మంచిర్యాల తండా) ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా పి. దిగంబర్‌రావు (జెడ్పీహెచ్ఎస్ ఖాదిరాబాద్), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ఎల్. శ్రీనివాస్ (జెడ్పీహెచ్ఎస్ మర్వెల్లి), అసోసియేట్ మహిళా అధ్యక్షురాలిగా ఎన్. నివేదిత (జెడ్పీహెచ్ఎస్ ఖాదిరాబాద్) ఎంపికయ్యారు.అలాగే ఉపాధ్యక్షుడిగా ఏ. బాలరాజు (ఎంపీయూపీఎస్ దుధ్యాల), మహిళా ఉపాధ్యక్షురాలిగా డి. సైలీల (జెడ్పీహెచ్ఎస్ మర్వెల్లి), కార్యదర్శిగా ఎం. ఆనంద్ (జెడ్పీహెచ్ఎస్ దేవనూరు), మహిళా కార్యదర్శిగా కె. సౌజన్య (జెడ్పీహెచ్ఎస్ నిర్జప్ల) ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గ సభ్యులకు పీఆర్టీయూటీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఏ. మానయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభు, గౌరవ అధ్యక్షుడు తులసీరామ్ రాథోడ్ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ అభివృద్ధికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

# జహీరాబాద్ పట్టణంలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవం

- పాల్గొన్న ఎంపీ సురేష్‌షెట్కార్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చంద్రశేఖర్ - రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి





**జహీరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణంలో సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వినాయక నిమజ్జన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్, ఇంచార్జ్ చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఉత్సవా లను విజయ వంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులనుఅభినందించారు. ఈ వేడుకల్లో సిడిసి చైర్మన్ ముబీన్, మున్సిపల్ చైర్మన్ యునూస్, జహీరాబాద్, న్యాల్కల్ మండల, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, భాస్కర్ రెడ్డి, నరేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బి. శ్రీనివాస్ రెడ్డి, కండెం. నర్సింహులు, శ్రీకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, ఖాజామియా, జమిలాలోద్దిన్, అరుణ్ కుమార్, నిజాం, అక్రం, జహీంగీర్, అతిక్, ఇర్మియ ప్రజాప్రతి నిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాసానిపల్లిలో మెగా వైద్య శిబిరం.. 200 మందికి వైద్య సేవలు





**అందోల్, సెప్టెంబర్ 26, (ప్రజాజ్యోతి):**

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తే చిన్న సమస్యే పెద్ద అనారోగ్యంగా మారే అవకాశం ఉంది. అయితే ఆర్థిక ఇబ్బందులతో చాలామంది వైద్య పరీక్షలకు దూరమవుతున్న పరిస్థితుల్లో.. గ్రామంలోనే ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో మాసానిపల్లి ప్రజలకు కొంత ఊరట లభించింది. మన హాస్పిటల్ సంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, వైద్య సలహాలు అందించారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ వైద్య సేవలతో పాటు బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు, ఈసీజీ నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి వైద్యులు తగిన సూచనలు చేయడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ బంటు సత్యనారాయణ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. అనారోగ్యం వచ్చిన తర్వాత ఆస్పత్రికి వెళ్లడం కంటే ముందుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన హాస్పిటల్ వైద్యులు సుమంత్, సబిత ఆధ్వర్యంలో వైద్య సేవలు కొనసాగాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు శంకర్‌గౌడ్, యాదాకిషన్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

## -ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
## -వాణి నగర్ కాలనీలో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన





**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)**

అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్ కాలనీలో రూ.48 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వాణి నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమీన్ పూర్ డివిజన్‌లోని ప్రతి కాలనీకి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వెదిరి కాలనీ, ఓడిఎఫ్ కాలనీలలోని వినాయక మండపాలను దర్శించుకుని.. అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, డిఈ వెంకటరమణ, సీనియర్ నాయకులు ఉపేందర్, మల్లేష్, రాములు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

## - ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం గడీల పాలనపై తిరుగుబాటు చేసి తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని చాటిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తన హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రజక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మట్టి వినాయకుడికి ఘనంగా వీడ్కోలు

**రాయికోడ్ సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో 12 రోజులుగా పూజలందుకున్న మట్టి వినాయకుడి నిమజ్జనోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు, యువత,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, భక్తి గీతాలు,చిరుతల రామాయణంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు నిర్వహించిన లడ్డూ వేలంలో పెద్ద లడ్డును ఇందూరి ప్రభాకర్ రూ.75,500 కు, చిన్న లడ్డును అంజలి మోటార్స్ యజమాని నర్సిములు రూ.50,500 కు దక్కించుకున్నారు.



# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

## - ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి







**నారాయణఖేడ్, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి:**

మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని బాలసదనం వేదికగా మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ హాజరై లబ్ధిదారులకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలు కుట్టు



మిషన్లను సద్వినియోగం చేసుకుని ఇంటి వద్దనే ఉపాధి పొందాలని సూచించారు. స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, డీఎండబ్ల్యు వెంకటేశ్వర రావు, పార్టీ మండల అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మైనారిటీ మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

---

# మునిదేనుపల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు..

## - వీరనారి పోరాట స్ఫూర్తిని స్మరించుకున్న గ్రామస్తులు..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మునిదేనుపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భూమి కోసం, పేదల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. మహిళా శక్తికి, సామాజిక న్యాయానికి ఐలమ్మ జీవితం గొప్ప స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి కృష్ణ, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

## - 264 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి:**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులో ఉన్న సమావేశ మందిరంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్, సిర్గాపూర్, కంగ్టి, నిజాంపేట్, కల్హేర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 120 చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి 144 చెక్కులు, మొత్తంగా 264 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఆడపిల్లల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అదేవిధంగా అనారోగ్యం, వైద్య చికిత్స వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గంలోని అన్ని మండలాల అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 36 రకాల నైవేద్యాలతో బడా గణపయ్యకు ఘన వీడ్కోలు

# కన్సాన్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో ముగిసిన వినాయక ఉత్సవాలు







**అందోల్, సెప్టెంబర్ 26, (ప్రజాజ్యోతి):**

పదకొండు రోజులుగా భక్తుల పూజలందుకున్న 14 అడుగుల బడా గణపయ్యకు కన్సాన్‌పల్లి శివాలయం వద్ద భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు పలికారు. మహాదేవ్ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి 36 రకాల పిండి వంటకాలతో నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల చివరి రోజు కావడంతో గ్రామం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బడా గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యువత ఆధ్వర్యంలో వివిధ రకాల పిండి వంటకాలను సిద్ధం చేసి నైవేద్యంగా సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పూజారి ఆనంద్ ఆధ్వర్యంలో ఉద్వాసన పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరబోయిన కృష్ణమాధవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించారు. మహాదేవ్ అసోసియేషన్ యూత్ సభ్యులు మాట్లాడుతూ.. భక్తుల సహకారంతో పదకొండు రోజుల పాటు వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామని తెలిపారు. చివరి రోజు ప్రత్యేక నైవేద్య కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులు, గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆదివారం మధ్యాహ్నం నిమర్జన కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మరవెల్లిలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

## - లడ్డూ వేలంలో మండలంలోనే రికార్డు.. రూ.80 వేలకు దక్కించుకున్న భక్తుడు!

## - కోలాటాలు, ఆటపాటలు, యువత నృత్యాలతో మార్మోగిన గ్రామం

**వట్పల్లి, ప్రజా జ్యోతిసెప్టెంబర్ 26**

సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల్ మరవెల్లి గ్రామంలో. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద వీరశైవ లింగాయత్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, శనివారం ఘనంగా నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తుల జయజయధ్వానాలు, గణపతి నామస్మరణల మధ్య గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

**రూ.80 వేలతో లడ్డూ వేలంలో రికార్డు**

నిమజ్జన వేడుకల్లో భాగంగా నిర్వహించిన వినాయక లడ్డూ వేలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలం పాటలో లడ్డూకు ఏకంగా రూ. 80 వేల ధర పలకడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. వట్పల్లి మండలంలోనే అత్యధిక ధర పలికిన లడ్డూగా ఇది నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భక్తుల పోటాపోటీ వేలం పాటతో కార్యక్రమంలో ఉత్సాహం ఉరకలెత్తింది.

**కోలాటాలు.. యువత నృత్యాలతో సందడి**

వినాయక నిమజ్జన శోభాయాత్రలో మహిళల కోలాటాలు, యువత ఆటపాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు చప్పుళ్లు, గణపతి నామస్మరణలతో గ్రామ వీధులు మార్మోగాయి. చిన్నారులు, మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను మరింత వైభవంగా మార్చారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిమజ్జన కార్యక్రమాన్ని తిలకించారు. వీరశైవ లింగాయత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి, ఐక్యత, ఉత్సాహం కలగలిసిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ సందడిని నింపాయి. గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ నిమజ్జన కార్యక్రమాన్ని



ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.